జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం
బుధవారం | 23 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 5

## మారెళ్లపాడు ప్రాజెక్టు పూర్తి.. తుమ్మలచెరువుకు జలధార

- రైతుల చిరకాల స్వప్నం సాకారం..
- మారెళ్ళ పాడు ఇరిగేషన్ ప్రాజెక్టు కు విచ్చేయనున్న మంత్రులు, ఎంపీ



**అశ్వాపురం: సెప్టెంబర్ 22, ప్రజాజ్యోతి** మారెళ్లపాడు ఇరిగేషన్ ప్రాజె క్టు పనులు పూర్తికావడంతో అశ్వాపురం మండలంలోని తుమ్మలచెరువు ఆనకట్టకు సాగునీరు అందించే ప్రక్రియకు మార్గం సుగమమైంది. ప్రాజెక్టు పూర్తితో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. సాగునీటి కోసం చాలాకాలంగా ఎదురుచూస్తున్న రైతుల ఆశలు నెరవేరనున్నాయని స్థానికులు పేర్కొంటున్నారు .మారెళ్లపాడు ప్రాజెక్టు పనులను వేగంగా పూర్తి చేయడంలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రత్యేక చొరవ చూపారని కాంగ్రెస్ నాయకులు, రైతులు తెలిపారు. ప్రాజెక్టు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అధికారులతో సమన్వయం మిగతా 2 లో...

- సింగరేణిలో ఏఐటీయూసీ నేతల తీరుపై పెరుగుతున్న విమర్శలు
- ప్రశ్నించే కార్మికులపై ఒత్తిడి.. వ్యక్తిగత వ్యవహారాల్లో జోక్యం
- మహిళా ఉద్యోగి వ్యవహారంతో మరోసారి చర్చలోకి సంఘ నాయకత్వం
- క్వార్టర్ కేటాయింపులో రూ.4 లక్షల వ్యవహారం.. వెలుగులోకి కీలక అంశాలు
- గుర్తింపు సంఘం పేరుతో పెత్తనం సాగుతోందా?.. సమగ్ర విచారణకు డిమాండ్..




## కార్మికులను వేధిస్తున్న.. ఏఐటీయూసీ..?

**భద్రాద్రి కొత్తగూడెం / సింగరేణి ప్రతినిధి, సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి):** సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారం కోసం పోరాడుతుందని నమ్మి గుర్తింపు హోదా కల్పించిన కార్మిక సంఘంపైనే ఇప్పుడు తీవ్ర స్థాయి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కార్మికులకు అండగా నిలవాల్సిన ఏఐటీయూసీకి చెందిన కొందరు నాయకులు తమను ప్రశ్నించే ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారనే విమర్శలు సింగరేణి వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారాయి. సంఘం పేరుతో పెత్తనం చెలాయిస్తూ వస్తున్న వరుస ఆరోపణలపై సింగరేణి యాజమాన్యం, పోలీసులు మరియు విజిలెన్స్ యంత్రాంగం సమగ్ర విచారణ జరిపించాలని కార్మిక వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి.

ఏఐటీయూసీ నేతలపై వెల్లువెత్తుతున్న ఆరోపణలు:

**1. దివ్యాంగుడైన కార్మికుడిపై వేధింపులు:**

కొత్తగూడెం ఏరియాలోని పీవీకే 5 గని ప్రాంతానికి చెందిన ఒక ఫిట్ సెక్రటరీ, అక్కడే పనిచేస్తున్న అంగవైకల్యం ఉన్న కార్మికుడిని భయపెట్టి తీవ్ర ఇబ్బందులకు గురిచేశారనేది మొదటి ప్రధాన ఆరోపణ. దీనిపై ఇప్పటికే పలు ఫిర్యాదులు దాఖలయ్యాయి.

**2. గిరిజన యువతి ఆత్మహత్య వ్యవహారం:**

పీవీకే 5 గనికి అప్రెంటిస్ కోసం వచ్చిన ఒక గిరిజన యువతి కొన్ని నెలల క్రితం మిగతా 2 లో...

## రామవరంలో భూ రీ-సర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



### పట్టా, అసైన్‌మెంట్, అటవీ భూముల హద్దులను రికార్డుల ఆధారంగా నిర్ధారించాలి

### జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్ , సెప్టెంబర్ 22, (ప్రజాజ్యోతి )** కొత్తగూడెం మండలం రామవరం రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ రీ-సర్వే పనులను జిల్లా కలెక్టర్ అంకిత్ మంగళవారం పరిశీలించారు. సుజాతనగర్–రామవరం–గరీబ్ పేట ట్రైజంక్షన్ వద్ద జరుగుతున్న సర్వే పనులను పరిశీలించి, సర్వే పురోగతి, భూ హద్దుల నిర్ధారణ, సర్వే నంబర్లు, భూముల విస్తీర్ణానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రామవరం రెవెన్యూ పరిధిలో సుమారు 1,950 ఎకరాల భూమికి రీ-సర్వే నిర్వహించాల్సి ఉందని , సర్వే పరిధిలో సుమారు 146 ఎకరాల మేర అటవీ భూమి ఉన్నట్లు అధికారులు వివరించారు. సర్వే నంబర్లు 23, 30, 31 తదితర ప్రాంతాల్లో జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. అటవీ భూముల హద్దులు ఇప్పటికే నిర్ధారితంగా ఉన్న ప్రాంతాల్లో అనవసర జాప్యం లేకుండా మిగతా 2 లో...

## ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే



**ఇల్లందు, సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి )** హైదరాబాద్ లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క, మహబూబాబాద్ యంపి పోరిక బలరాం నాయక్, సహచర గిరిజన ఎమ్మెల్యేలతో కలిసి మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని ఇల్లందు ఎమ్మెల్యే, రాష్ట్ర శాసనసభ అంచనాల కమిటీ చైర్మన్ కోరం కనకయ్య కలిశారు. ఇటీవల తిరుమల తిరుపతి శ్రీవారి దైవదర్శనానికి వెళ్లి రావడంతో మిగతా 2 లో...

## రేషన్ కార్డుల దందా పై విచారణ

- కలెక్టరేట్ లో రేషన్ కార్డుల అక్రమాలపై కలెక్టర్ సీరియస్
- ఇదరు ఉద్యోగులకు నోటీసులు...
- డేటా ఎంట్రీ ఆపరేటర్ శివకుమార్, బండి మధుబాబు విచారణకు హాజరుకావాలని
- డీపీఓ ఆదేశం...
- 'ప్రజాజ్యోతి' వరుస సంచలనాల కథనా

**ప్రజాజ్యోతి ఎఫెక్ట్...**

లతో రేషన్ కార్డుల దందా కేసులో కదిలిన జిల్లా యంత్రాంగం...

- 23న జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో విచారణ..!
- రికార్డులతో హాజరు కావాలని ఆదేశం..



ప్రజాజ్యోతి

భద్రాద్రి కలెక్టరేట్ కి కల్తీ మరక



ప్రజాజ్యోతి

కలెక్టరేట్ లోనే

ఫేక్ రేషన్ కార్డు దందా


రేషన్ దందా...



ప్రజాజ్యోతి

కొత్తగూడెం కలెక్టరేట్ పేరుతో

రేషన్ దందా...



## ముఖ్యమంత్రిని కలిసిన ఎమ్మెల్యే



(మొదటి పేజీ తరువాయి...)

ముఖ్యమంత్రిని శ్రీవారి శాలువాతో సత్కరించి మహా ప్రసాదం అందజేశారు. ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో భాగంగా గిరిజన శాసనసభ నియోజకవర్గాలకు అధికంగా ఇండ్లను కేటాయించాలని ముఖ్యమంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో అశ్వరావుపేట, భద్రాచలం, వైరా, మహబూబాబాద్ ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, డాక్టర్ తెల్లం వెంకట్రావు, మాలోత్ రాందాస్ నాయక్, డాక్టర్ మురళి నాయక్ పాల్గొన్నారు.

## రామవరం లో భూ రీ-సర్వే పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్

(మొదటి పేజీ తరువాయి...)

మిగిలిన రీ-సర్వే పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. సర్వే పరిధిలో పోడు సాగు చేస్తున్న భూములు ఉన్నాయని, అర్హులైన వారికి ఆర్ ఓ ఎఫ్ ఆర్ కింద హక్కులు కల్పించినట్లు అధికారులు వివరించారు. సుమారు 420 మందికి పైగా పట్టాదారులు ఉన్నారని, ఇందులో గిరిజనులు, ఇతర వర్గాలకు చెందిన వారు ఉన్నట్లు తెలిపారు. రీ-సర్వే ద్వారా భూ హద్దులు స్పష్టమై, హక్కుదారులకు ప్రయోజనం కలిగేలా రికార్డులను పక్కాగా రూపొందించాలని కలెక్టర్ సూచించారు.నేడు సమ్మక్క గద్దె సమీప ప్రాంతం నుంచి సుమారు 2.3 నుంచి 2.5 కిలోమీటర్ల మేర సరిహద్దు సర్వే నిర్వహించినట్లు అధికారులు వివరించారు. అక్కడ ఉన్న పాత సరిహద్దు రాళ్లు, మ్యాప్‌లు, రికార్డులను పరిశీలించి హద్దులను ఖచ్చితంగా నిర్ధారించాలని కలెక్టర్ ఆదేశించారు.రీ-సర్వే పనులను ప్రణాళికాబద్ధంగా, వేగవంతంగా చేపట్టి నెలన్నరలోగా మొత్తం ప్రక్రియను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ భూ హద్దులను స్పష్టంగా నిర్ధారించి, భూ రికార్డుల్లో ఎలాంటి అయోమయానికి తావులేకుండా సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని ఆయన స్పష్టం చేశారు.ఈ పరిశీలనలో తహసీల్దార్ పుల్లయ్య, సర్వేయర్ అశోక్, ఆర్ఐ గణపతి, లైసెన్సుడ్ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, అటవీశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాలేజీకి వెళ్లిన యువతి అదృశ్యం

- పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు




**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 22, (ప్రజా జ్యోతి)** కాలేజీకి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి కనిపించకుండా పోయిన సంఘటన పాల్వంచ మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి...పాల్వంచ మండలం, లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన సుజాత (45) పెద్ద కుమార్తె బిందు (21) కె ఎల్ ఆర్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ 3వ సంవత్సరం చదువుతోంది. ఈనెల 19న ఉదయం సుమారు 10:గంటల సమయంలో బిందు ప్రాక్టికల్స్ ఉన్నాయ నీ కాలేజీకి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరింది. సాయంత్రమైనా ఆమె తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు కాలేజీ స్నేహితులు , బంధువుల వద్ద విచారించారు. అయితే ఆమె కాలేజీకి రాలేదని, ఎక్కడికి వెళ్లిందో సమాచారం లేదని తేలింది. కాగా, అదే గ్రామానికి (రామానుజవరం పంచాయతీ, కేంద్రీయ విద్యాలయం అమాయ్ అమ్రత్) చెందిన రామసామి కుమారుడు వెంకటేశ్వర్లు (25) అనే యువకుడిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. అతను తమ అమ్మాయిని తీసుకెళ్లి ఉంటాడని భావిస్తూ, బిందు తల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు, అదృశ్యమైన యువతి గుర్తులు, ఎత్తు: 5.1 అంగుళాలు , రంగు: ఎరుపు (తెలుపు) , భాషలు: తెలుగు, ఇంగ్లీష్ మాట్లాడగలదనీ , యువతికి సంబంధించి ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

# కార్మికులను వేధిస్తున్న.. ఏఐటీయూసీ..?

(మొదటి పేజీ తరువాయి...)

ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. ఈ విషాదకర ఘటన వెనుక ఏఐటీయూసీకి అనుబంధంగా ఉన్న వ్యక్తుల ప్రమేయం ఉందంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**3. కేసు విచారణను తప్పుదోవ పట్టించే యత్నం:**

రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపిన ఓయూ విద్యార్థిని తాండ్ర అక్షిత రాణి ఘటనలో అరెస్ట్ అయిన బొమ్మ కంటి రవికుమార్ ఏఐటీయూసీ అనుబంధ వ్యక్తిగా ప్రచారంలో ఉన్నాడు. ఇతనిపై ఏప్రిల్ 8న మొదట్లో ఫిర్యాదు వచ్చినప్పుడు విచారణను తప్పుదోవ పట్టించేలా అధికారులపై సంఘ నాయకులు ఒత్తిడి తెచ్చారనే బలమైన ఆరోపణలు ఉన్నాయి.

**4. మహిళా ఉద్యోగి గర్భం దాల్చిన వ్యవహారం:**

రామగుండం ఏరియాలోని సంస్థలో పనిచేసే మరొక మహిళా ఉద్యోగి గర్భం దాల్చిన వ్యవహారం కొన్ని రోజుల క్రితం వెలుగులోకి వచ్చింది. ఈ అంశంలోనూ సంఘానికి చెందిన ఒక వ్యక్తి పాత్ర ఉందనే వార్తలు సింగరేణి కార్మిక వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమవుతున్నాయి.

**5. ఒంటరి మహిళా ఉద్యోగిపై వ్యక్తిగత దూషణలు, దాడి:**

రామగుండం-1 ఏరియాలో తమను ప్రశ్నించిన ఒక ఒంటరి మహిళా ఉద్యోగిని లక్ష్యంగా చేసుకుని, ఆమెపై వ్యక్తిగత ఆరోపణలు చేస్తూ కించపరిచేలా ప్రైవేటు పాటలు రాయించి ప్రచారం చేయించారనే ఆరోపణలు ఉన్నాయి. అంతేకాకుండా సదరు మహిళపై ఒక సంఘ నాయకుడు, అతని కుమారుడు మరి కొందరితో కలిసి ప్రత్యక్షంగా దాడికి పాల్పడ్డారనే అంశంపై పోలీసులు స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

**6. నాయకుల కుటుంబ సభ్యులకు ప్రత్యేక మినహాయింపులు:**

రామగుండం-1 ఏరియాలోనే విధి నిర్వహణలో నిద్రపోతున్న తన కుమారుడి వ్యవహారాన్ని సమర్థిస్తూ ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ "నా కొడుకు నిద్రపోతే మీకేం అవసరం?" అని మాట్లాడటం వివాదాస్పదమైంది. నిబంధనలు అందరికీ ఒకేలా వర్తించవా అని ప్రశ్నిస్తూ, ఆ దృశ్యాలను వీడియో తీసిన కార్మికుడిపై నేతలు దురుసుగా ప్రవర్తించారని ఫిర్యాదులు ఉన్నాయి.

**7. క్వార్టర్ల కేటాయింపుల్లో రూ.4 లక్షల దందా:**

అధికారిక కౌన్సెలింగ్ ద్వారా క్వార్టర్ పొందిన ఉద్యోగిని పక్కన పెట్టి, మరొకరు అక్కడ నివాసం ఉండేలా జోక్యం చేసుకున్నారనే విమర్శలు గోదావరిఖని వ్యాప్తంగా చక్కర్లు కొడుతున్నాయి. ఒకరికి కేటాయించిన క్వార్టర్‌ను తిరిగి ఇప్పించే క్రమంలో నేతలకు ఏకంగా రూ.4 లక్షల వరకు నగదు లావాదేవీలు జరిగాయనేది తీవ్రమైన ఆరోపణగా మారింది.

**నిజాలు నిగ్గు తేల్చాల్సిన సమయం!**

గుర్తింపు సంఘం హోదా అనేది కార్మికుల సేవా బాధ్యత తప్ప, ప్రశ్నించే వారిని అణచివేసే అధికారం కాదని సింగరేణి కార్మిక వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. పై పేర్కొన్న వరుస ఆరోపణలు, క్వార్టర్ల దందా, మహిళా ఉద్యోగుల పట్ల దుర్ప్రవర్తన వంటి తీవ్ర అంశాలపై సింగరేణి యాజమాన్యం, కార్మిక శాఖ మరియు పోలీసు యంత్రాంగం నిష్పాక్షికంగా విచారణ చేపట్టి నిజాలు నిగ్గు తేల్చాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు రుజువైతే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నిరాధారమైతే స్పష్టతనివ్వాలని కార్మిక లోకం కోరుతోంది.

# రేషన్ కార్డుల దందా పై విచారణ

**సాక్షాత్తు కలెక్టరేట్ గడపలోనే పేదల కడుపు కొట్టి, రేషన్ కార్డుల దందాను 'ప్రజాజ్యోతి' దినపత్రిక బట్టబయలు చేసింది. "కలెక్టరేట్ లోనే రేషన్ కార్డు దందా" అంటూ ప్రజాజ్యోతి సాహసోపేతంగా ప్రచురించిన పరిశోధనాత్మక కథనాలకు జిల్లా యంత్రాంగం ఉలిక్కిపడింది. 'ప్రజాజ్యోతి' కథనాన్ని సుమోటోగా తీసుకున్న జిల్లా కలెక్టర్ వెంటనే విచారణకు ఆదేశించడంతో, అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలకు తూట్లు పొడుస్తూ, అర్హత లేని ఉద్యోగులు, పెన్షనర్లకు డబ్బులు తీసుకుని కార్డులు అమ్ముతున్న వైనాన్ని బట్టబయలు చేసింది . దీంతో కళ్లు తెరిచిన జిల్లా పాలనా యంత్రాంగం, వెంటనే జిల్లా పంచాయతీ అధికారికి విచారణ బాధ్యతలు అప్పగించింది. ఆ క్రమంలోనే డేటా ఎంట్రీ ఆపరేటర్ శివకుమార్ పాత్రపై అనుమానం వ్యక్తం చేస్తూ విచారణకు పిలిచారు.**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి, సెప్టెంబర్ 22, (ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్‌లో వెలుగుచూసిన రేషన్ కార్డుల దందాపై 'ప్రజాజ్యోతి' దినపత్రికలో ప్రచురితమైన ప్రతికూల వార్తా కథనాలకి జిల్లా యంత్రాంగం స్పందించింది. "కలెక్టరేట్ లోనే రేషన్ కార్డు దందా" అనే శీర్షికతో సెప్టెంబర్ 14న ప్రచురితమైన కథనాన్ని సుమోటోగా తీసుకున్న జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ విచారణకు ఆదేశించారు.

**పూర్తి స్థాయిలో విచారణ జరగాలి...**

ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం నుంచి నోటీసు నెం. ఏ3/1357/2026, తేదీ 22.09. 2026న జారీ అయ్యింది. ఆ నోటీసు ప్రకారం జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న శివకుమార్‌పై వార్తాపత్రికలో పేర్కొన్న విధంగా కొన్ని ఆరోపణలు వచ్చాయని, ప్రభుత్వ ఉద్యోగులు మరియు పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు డబ్బులు వసూలు చేసి రేషన్ కార్డులు జారీ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించడంతో జిల్లా డీపీఓ ఈ విచారణ చేపడుతున్నారు.

ఈ విచారణ సెప్టెంబర్ 23 తేదీన జిల్లా పౌరసరఫరాల కార్యాలయంలో జరగనుందని తెలుస్తోంది.

**ఆన్ లైన్ లాగిన్ వివరాలను సిద్ధం చేయాలి...**

ఈ విచారణకు శివకుమార్ డేటా ఎంట్రీ ఆపరేటర్ మరియు బండి మధుబాబు సకలమూలాలతో సహా హాజరు కావాలని, విచారణకు సంబంధిత రికార్డులు మరియు ఆన్ లైన్ లాగిన్ వివరాలను సిద్ధం చేసుకొని రావాలని జిల్లా పంచాయతీ అధికారి ఆదేశించారు. ఈ విచారణకు పైన పేర్కొన్న వారు గైర్హాజరైతే ఏకపక్షంగా విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటామని నోటీసులో హెచ్చరించారు. ప్రజాజ్యోతి రాసిన కథనానికి అధికారికంగా విచారణ మొదలవడం పట్ల ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది. విచారణలో నిజాలు నిగ్గు తేలి, అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## మారెళ్లపాడు ప్రాజెక్టు పూర్తి.. తుమ్మల చెరువుకు జలధార

(మొదటి పేజీ తరువాయి...)

చేసుకోవడంతో పాటు, అవసరమైన చోట పనులను వేగవంతం చేయడంపై దృష్టిసారించారని పేర్కొన్నారు. ఆయన కృషితోనే ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తయ్యాయని వారు అభిప్రాయపడ్డారు. ప్రాజెక్టు పూర్తికావడంతో తుమ్మలచెరువు ఆనకట్టకు జలాలు చేరనున్న నేపథ్యంలో రైతుల ముఖాల్లో ఆనం దం వెల్లివిరుస్తోంది. సాగునీరు అందుబాటులోకి వస్తే పంటల సాగుకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని రైతులు ఆశిస్తున్నారు. ఆయకట్టు పరిధిలోని భూములకు సమృద్ధిగా నీరు అందడంతో వ్యవసాయ రంగానికి మరింత ఊతం లభిస్తుందని భావిస్తున్నారు.మారెళ్లపాడు ప్రాజెక్టు ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి శ్రీహరి, మహబూబాబాద్ ఎంపీ తదితర ప్రజాప్రతినిధులు హాజరు కానున్నట్లు సమాచారం. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కూడా కార్యక్రమానికి హాజరయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి మంత్రులు, ప్రజాప్రతినిధులు రానున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లపై దృష్టి సారిస్తున్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ప్రాజెక్టు పూర్తితో తుమ్మలచెరువు ప్రాంత రైతులకు సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**సాగునీరు చివరి ఆయకట్టుకూ అందాలి....**

మారెళ్లపాడు ప్రాజెక్టు ద్వారా అందే నీరు ఆయకట్టు చివరి భూముల వరకు చేరేలా అధికారులు పర్యవేక్షించాలని రైతులు కోరుతున్నారు. ప్రాజెక్టు పూర్తయిన ఆనందం రైతులకు పూర్తిగా దక్కాలంటే నీటి సరఫరా నిరంతరాయంగా కొనసాగించడంతో పాటు కాలువల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# సుక్మాలో నక్సలైట్ ల డంప్ గుర్తింపు

- ఆయుధాలు ,పేలుడు పదార్థాల స్వాధీనం



**సుక్మా, సెప్టెంబర్ 22(ప్రజా జ్యోతి):** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో నక్సల్ వ్యతిరేక ఆపరేషన్‌లో భద్రతా దళాలు కీలకంగా వ్యవహరించాయి. సుక్మా–తెలంగాణ సరిహద్దు ప్రాంతంలోని ఛోటే కంచాల అటవీ ప్రాంతంలో నిర్వహించిన గాలింపు చర్యల్లో నక్సలైట్లు దాచిపెట్టిన డంప్‌ను భద్రతా సిబ్బంది గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.సీఆర్పీఎఫ్ 150వ బెటాలియన్‌కు చెందిన సిబ్బంది అటవీ ప్రాంతంలో గాలింపు చేపడుతుండగా అనుమానాస్పద వస్తువులు కనిపించడంతో పరిసర ప్రాంతాన్నిక్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలో దాచిపెట్టిన డంప్‌ను గుర్తించి సోదాలు నిర్వహించగా పెద్ద సంఖ్యలో వైర్‌లెస్ సెట్లు, సింగిల్ షాట్ రైఫిల్‌తో పాటు నక్సలైట్ కార్యకలాపాలకు ఉపయోగించే ఇతర సామగ్రి లభించినట్లు అధికారులు తెలిపారు.స్వాధీనం చేసుకున్న వైర్‌లెస్ సెట్లను సమాచార మార్పిడి, పరస్పర సంబంధాల కోసం ఉపయోగించే అవకాశం ఉందని భద్రతా వర్గాలు తెలిపారు . అటవీ ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహించే నక్సలైట్ దళాలు కమ్యూనికేషన్ కోసం ఇలాంటి పరికరాలను వినియోగిస్తుంటాయని అన్నారు.స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, సామగ్రిని భద్రతా దళాలు తమ ఆధీనంలోకి తీసుకుని తదుపరి దర్యాప్తు చేపట్టాయి. ఈ డంప్ ఏ నక్సలైట్ గ్రూపునకు చెందినది, సామగ్రిని ఎప్పటి నుంచి అక్కడ దాచిపెట్టారు, ఏ కార్యకలాపాల కోసం వినియోగించాలనుకున్నారు అనే వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు.తెలంగాణ సరిహద్దుకు ఆనుకుని ఉన్న సుక్మా అటవీ ప్రాంతంలో నక్సల్ వ్యతిరేక గాలింపు, ప్రాంత ఆధిపత్య చర్యలు కొనసాగుతున్నాయి అని ఛోటే కంచాల అడవుల్లో డంప్ గుర్తించిన నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లోనూ భద్రతా బలగాలు గాలింపును ముమ్మరం చేసే అవకాశం ఉంది అని అధికారులు తెలిపారు.

# మావోయిస్టుల ఆయుధాల డంప్ గుర్తింపు

- ఆయుధాలు ,ఎస్ఎల్ఆర్, ఇన్సాస్, బీజీఎల్ లాంచర్లు స్వాధీనం



**చర్ల , సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి):** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులపై భద్రతా దళాలు చేపట్టిన గాలింపు, మైన్ల తొలగింపు ఆపరేషన్‌లో భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. బెద్రే పోలీస్‌స్టేషన్ పరిధిలోని లంకా పహాడి గ్రామ అటవీ ప్రాంతంలో భద్రతా దళాలు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తుండగా, భూగర్భంలో దాచిన మావోయిస్టుల డంప్‌ను గుర్తించారు.డంప్ నుంచి ఒక ఎస్ఎల్ఆర్/ఎల్ఎంజీ రైఫిల్, ఒక ఇన్సాస్ రైఫిల్, ఒక .315 బోర్ గన్, రెండు బీజీఎల్ లాంచర్లు, 17 బీజీఎల్ సెల్స్, ఒక చైనా హ్యాండ్ గ్రెనేడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటితో పాటు 49 ఎస్ఎల్ఆర్ రౌండ్లు, 15 .315 బోర్ రౌండ్లు, 15 బీజీఎల్ కాట్రిడ్జ్‌లు, నాలుగు ఎస్ఎల్ఆర్ మ్యాగజైన్లు, ఒక .315 బోర్ మ్యాగజైన్‌తో పాటు ఇతర సామగ్రి, పరికరాలు లభ్యమయ్యాయి.స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, మందుగుండు సామగ్రిని పోలీసులు జప్తు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు, దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**సెప్టెంబర్‌లో వరుసగా డంప్‌ల స్వాధీనం....**

సెప్టెంబర్ నెలలో బీజాపూర్ జిల్లాలో భద్రతా దళాలు నిర్వహించిన వివిధ ఆపరేషన్లలో గతంలో మావోయిస్టులు దాచిన పలు ఆయుధ డంప్‌లను స్వాధీనం చేసుకున్నారు. సెప్టెంబర్ 20న భైరామ్‌గఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అద్వాడ అటవీ ప్రాంతంలో ఏకే–47, .315 బోర్ ఆయుధం, సింగిల్‌షాట్ గన్, పిస్టల్‌తో పాటు రౌండ్లు, మ్యాగజైన్‌ను స్వాధీనం చేసుకున్నారు.సెప్టెంబర్ 16న ఫర్సేగఢ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బడే అల్వాడ అటవీ ప్రాంతంలో .315 బోర్ రైఫిల్, 49 లైవ్ రౌండ్లు, .303 బోర్‌కు చెందిన 25 రౌండ్లు, 12 బోర్‌కు చెందిన 49 రౌండ్లు, 8 కిలోల జిలాటిన్, వాకీటాకీ, ఇతర పరికరాలను స్వాధీనం చేసుకున్నారు.సెప్టెంబర్ 10న మిర్తూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇంద్రిపాల్ అటవీ ప్రాంతంలో వివిధ ప్రదేశాల నుంచి 7 కట్టల విద్యుత్ తీగలు, డిటోనేటర్లు, గ్రెనేడ్లను స్వాధీనం చేసుకున్నారు. సెప్టెంబర్ 1న భోపాల్‌పట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలోని నీలందగు అటవీ ప్రాంతంలోని మావోయిస్టుల డంప్ నుంచి 12 బోర్ నాటు తుపాకీ, ఒక బీజీఎల్ లాంచర్, 8 బీజీఎల్ సెల్స్, 10 లైవ్ రౌండ్లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. సెప్టెంబర్‌లో జరిగిన ఈ ఆపరేషన్లలో మొత్తం ఒక ఎల్ఎంజీ, ఒక ఏకే–47, ఒక ఇన్సాస్, రెండు .315 బోర్ ఆయుధాలు, 12 బోర్ ఆయుధాలు, మూడు బీజీఎల్ లాంచర్లు, రెండు పిస్టల్స్‌తో పాటు భారీగా పేలుడు పదార్థాలు, మందుగుండు సామగ్రి, ఇతర మావోయిస్టు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## మానవ అక్రమ రవాణాపై శిక్షణా కార్యక్రమం




**చర్ల, సెప్టెంబర్ 22 :(ప్రజా జ్యోతి):** మహిళలు, చిన్నారుల అక్రమ రవాణా నిర్మూలనలో అంగన్వాడీ టీచర్లు కీలక పాత్ర పోషించాలని సీడీపీఓ కె. రేవతి సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, చర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు, హైదరాబాద్‌కు చెందిన ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు మానవ అక్రమ రవాణా, సైబర్ ఆధారిత అక్రమ రవాణా, సంబంధిత చట్టాలపై ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.చర్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమాన్ని సీడీపీఓ రేవతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా తీవ్రమైన సామాజిక నేరమని అన్నారు. మహిళలు, యువతులు, చిన్నారులు వివిధ రకాలుగా అక్రమ రవాణాకు గురవుతున్నారని తెలిపారు. పిల్లలను పనుల్లోకి తీసుకెళ్లడం, యువతులను లైంగిక దోపిడీకి గురిచేయడం వంటి ఘటనలు జరుగుతున్నాయని అన్నారు.ప్రస్తుతం సామాజిక మాధ్యమాల వినియోగం పెరిగిన నేపథ్యంలో సైబర్ అక్రమ రవాణాపై కూడా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, మెసెంజర్ వంటి సామాజిక మాధ్యమాల్లో యువతులు, మహిళలు పోస్టు చేసే ఫొటోలను సైబర్ నేరగాళ్లు డౌన్‌లోడ్ చేసి మార్ఫింగ్ చేయడం, అనంతరం బ్లాక్‌మెయిల్ చేయడం వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. అంగన్వాడీ టీచర్లు తమ పరిధిలోని తల్లుల సమావేశాలు, గ్రామస్థాయి కార్యక్రమాల్లో ఈ అంశాలపై అవగాహన కల్పించాలని కోరారు.బాల్య వివాహాలు, మహిళలు, బాలికలపై నేరాలు జరిగినప్పుడు సంబంధిత అధికారులకు వెంటనే సమాచారం అందించాలని రేవతి సూచించారు. సమస్యలు ఎదురైనప్పుడు 112 పోలీస్ అత్యవసర సేవలు, 1930 సైబర్ నేరాల హెల్ప్‌లైన్, 181 మహిళా హెల్ప్‌లైన్‌ను సంప్రదించాలని తెలిపారు. చట్టపరమైన చర్యల సమయంలో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. శిక్షణ అనంతరం గ్రామ కమిటీల ద్వారా ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని అన్నారు.ప్రజ్వల జిల్లా సమన్వయకర్త సురేష్‌కుమార్ మాట్లాడుతూ బాలికలు, మహిళల రక్షణ కోసం ప్రజ్వల సంస్థ పని చేస్తోందన్నారు. సంస్థ ఆధ్వర్యంలో ఇప్పటివరకు వేలాది మంది బాలికలు, మహిళలను రక్షించి పునరావాసం కల్పించినట్లు తెలిపారు. మానవ అక్రమ రవాణాకు సంబంధించిన భారతీయ న్యాయ సంహిత–2023 (బీఎన్ఎస్), అనైతిక అక్రమ రవాణా నిరోధక చట్టం–1956 (ఐటీపీఏ), బాలలపై లైంగిక నేరాల నుంచి రక్షణ చట్టం–2012 (పోక్సో), బాల్య వివాహాల నిషేధ చట్టం–2006, బాలల న్యాయ చట్టం–2015 (జేజేఏ) తదితర చట్టాలపై అంగన్వాడీ టీచర్లకు అవగాహన కల్పించినట్లు తెలిపారు.అత్యవసర పరిస్థితుల్లో 112, సైబర్ నేరాలకు 1930, మహిళా హెల్ప్‌లైన్ 181 వంటి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. శిక్షణలో అక్రమ రవాణాకు గురైన బాలికలు, మహిళల జీవితాల ఆధారంగా రూపొందించిన లఘుచిత్రాలను ప్రదర్శించి, గ్రూప్ చర్చల ద్వారా అవగాహన కల్పించారు.శిక్షణ పొందిన అంగన్వాడీ టీచర్లతో గ్రామస్థాయిలో సమాజ జాగృతి సంఘాలు ఏర్పాటు చేసి, గ్రామాల్లో బాల్య వివాహాలు, మహిళలు, చిన్నారులపై నేరాలు, అక్రమ రవాణా వంటి సమస్యలను సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, పోలీస్, ఎంపీడీఓ, తహసీల్దార్ తదితర అధికారులకు వెంటనే నివేదించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రజ్వల సమన్వయకర్తలు భూపాల్, హరీష్, నాగరాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆదిలక్ష్మి, బ్లాక్ కోఆర్డినేటర్ నాగార్జున, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ పిల్లలకు విద్యా సామగ్రి పంపిణీ




**చర్ల, సెప్టెంబర్ 22:(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని ఉప్పుగూడెం గ్రామపంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. మంగళవారం గ్రామ సర్పంచ్ సోయం నాగలక్ష్మి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పిల్లలకు నోట్‌బుక్కులు, పెన్సిళ్లు, పలకలు, బలపాలు అందజేశారు. చిన్నారుల్లో విద్యపై ఆసక్తిని పెంపొందించడంతో పాటు, వారి చదువుకు అవసరమైన సామగ్రిని అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సర్పంచ్ తెలిపారు. అంగన్‌వాడీ చిన్నారుల విద్యాభివృద్ధికి గ్రామ పంచాయతీ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని ఆమె అన్నారు.

## 24న వినాయక నిమజ్జనం

- వాహనాలలో భద్రాచలం తరలింపు



**ఇల్లందు, సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి )** పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఆయా గణేష్ మండపాలలో కొలువు తీరిన వినాయక విగ్రహాలను ఈనెల 24న నిమజ్జనం చేయనున్నట్లు, వినాయక విగ్రహాలను మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో 20 లారీలలో భద్రాచలం తరలించనున్నట్లు ఇల్లందు మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, మున్సిపల్ కమిషనర్ సందీప్ లు తెలిపారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వర్షాలు లేని కారణంగా చెరువులు, కుంటలలో నీళ్లు లేవన్నారు. ఈనెల 24న జెకె సింగరేణి స్కూల్ క్రీడా మైదానం నుండి వినాయక విగ్రహాలను లారీల ద్వారా భద్రాచలం తరలించడం జరుగుతుందని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కరగకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో నిమర్జన ప్రక్రియ పూర్తయి ఎందుకు మండపాల నిర్వహకులు, ప్రజలు సహకరించాలని కోరారు. గత కొన్ని ఏళ్ల నుండి ఆనవాయితీగా వస్తున్న వినాయక విగ్రహాలకు స్వాగతం పలికే ఏర్పాట్లను సైతం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో వార్డు కౌన్సిలర్లు సైదుమియా, మహమ్మద్ జాఫర్, కొర్లపాటి శివ కిరణ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దొడ్డ డానియల్, పర్రె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఏకదంతా యూత్ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాదం

**ఇల్లందు, సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి )** పట్టణంలోని 11వ వార్డు జెకె కాలనీలోని ఏకదంతయా యూత్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన అన్నప్రసాద కార్యక్రమాన్ని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య సతీమణి కోరం లక్ష్మి, సింగరేణి సంస్థ ఇల్లందు ఏరియా జిఎం వీసం కృష్ణయ్య లు ప్రారంభించారు. గణేష్‌నవరాత్రులలో భాగంగా నిత్యం పూజలు అందుకునే గణనాథుని అత్యంత భక్తిశ్రద్ధలతో పూజించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ ప్రజలతో పాటు ఇల్లందు పట్టణ ప్రజలు సుఖ సంతోషాలు, అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని గణనాథుని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు భోళ్ల సూర్యం, మండల రాము, వార్డు కౌన్సిలర్లు రేఖ స్వరూప, మెరుగు కార్తీక్, సర్పంచులు వల్లాల మంగమ్మ, పాయం స్వాతి, గుగులోత్ నాగార్జున, మహిళా కాంగ్రెస్ నాయకురాలు మడుగు వెంకటలక్ష్మి, నాయకులు గందె సదానందం, రేఖ రవిశంకర్, ఈశ్వర్, ఏకదంతయా యూత్ కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.




# ఇల్లెందు ప్రభుత్వాసుపత్రిలో ఖరీదైన ఈఎన్‌టీ శస్త్రచికిత్స



**ఇల్లెందు, సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి)** కడప జిల్లాకు చెందిన 18 ఏళ్ల నారబోయిన మేఘనకు ఇల్లందు ప్రభుత్వాసుపత్రిలో సోమవారం ఖరీదైన ఈఎన్‌టీ శస్త్రచికిత్స నిర్వహించారు. గత మూడేళ్లుగా ముక్కులో గాలి సరిగా ఆడకపోవడం, తరచూ తుమ్ములు, తలనొప్పితో బాధపడుతున్న మేఘనకు హైదరాబాద్‌లోని వైద్యులు శస్త్రచికిత్స అవసరమని సూచించారు. ఇందుకు సుమారు రూ.లక్ష వరకు ఖర్చవుతుందని చెప్పడంతో ఆర్థిక ఇబ్బందుల కారణంగా చికిత్స చేయించుకోలేకపోయారు.మేఘన మేనమామ డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబును సంప్రదించగా, ఇల్లందు ప్రభుత్వాసుపత్రిలో ఈఎన్‌టీ సేవలు అందుబాటులో ఉన్నాయని సూచించారు. దీంతో మేఘనను ఆసుపత్రికి తీసుకురాగా ఈఎన్‌టీ వైద్యురాలు డాక్టర్ రవి తేజస్వి అవసరమైన పరీక్షలు నిర్వహించి ముక్కులోని వంకరను సరిచేసే శస్త్ర చికిత్స చేసి దిగువ కుడి ముక్కు కండరాన్ని సరిచేసే శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. సుమారు రూ.లక్ష వరకు ఖర్చయ్యే శస్త్రచికిత్సను ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా చేయడంపై మేఘన మేనమామ హర్షం వ్యక్తం చేస్తూ వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ వైద్యురాలు డాక్టర్ రవి తేజస్వి, ఆసుపత్రి సిబ్బందిని అభినందించారు. ప్రభుత్వాసుపత్రుల్లో అందుతున్న నాణ్యమైన వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# ఘనంగా హిందీ సోషల్ అవుట్ రీచ్



**కొత్తగూడెం కలెక్టరేట్ , సెప్టెంబర్ 22 , (ప్రజా జ్యోతి)** పాల్వంచలోని స్థానిక స్టార్ చిల్డ్రన్ హై స్కూల్ వేదికగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్వంచ (అటానమస్) హిందీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం 'హిందీ అవుట్ రీచ్' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సెప్టెంబర్ 14న హిందీ భారతదేశానికి రాజభాషగా గుర్తింపు పొందిన చారిత్రక దినాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాల హిందీ విభాగ అధ్యక్షురాలు డాక్టర్ టి. అరుణ కుమారి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు, హిందీ భారతదేశానికి ఒక జీవనాడి వంటిదని నేటి ఆధునిక ప్రపంచంలో హిందీ భాష నేర్చుకోవడం ద్వారా అద్భుతమైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు, అనంతరం విద్యార్థులలో సృజనాత్మకతను వెలికితీసేందుకు వ్యాసరచన ,హ్యాండ్ రైటింగ్ ,పుస్తక పఠనం, చార్ట్ పెయింటింగ్ ప్రముఖ కవులు , రచయితల పరిచయాలు వంటి విభిన్న పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా హిందీ భాషా ప్రాధాన్యతను తెలియజేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హిందీ భాషా విశిష్టతను చాటుతూ ప్లకార్డులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ జి. భాస్కరరావు ప్రిన్సిపాల్ జి. శ్రీనివాసరెడ్డి హిం దీ అధ్యాపకురాలు జి. రమాదేవి, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లక్ష్మీపురంలో ఘోర రోడ్డు ప్రమాదం

**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి ):** మండలంలోని లక్ష్మీపురం నయారా పెట్రోల్ బంక్ సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ద్విచక్ర వాహనదారుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముసలమడుగు గ్రామానికి చెందిన గద్దం సత్యం, గట్టుపల్లి పవన్‌కుమార్ ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా లక్ష్మీపురం నయారా పెట్రోల్ బంక్ సమీపంలో టిప్పర్ ఢీకొంది.టిప్పర్ ఢీకొన్న వేగానికి ద్విచక్ర వాహనంపై ఉన్న సత్యం అదుపుతప్పి రోడ్డుపై పడిపోవడంతో టిప్పర్ టైర్ల కింద పడ్డాడు. దీంతో తీవ్రంగా గాయపడిన సత్యం అక్కడికక్కడే మృతి చెందాడు. అదే ద్విచక్ర వాహనంపై ఉన్న పవన్‌కుమార్‌కు గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాద వివరాలను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో ముసలమడుగు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.మృతుడు సత్యం కుమారుడు ఆనంద్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బూర్గంపాడు ఎస్ఐ మేడ ప్రసాద్ కేసు నమో దు చేశారు. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యంపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# ఘనంగా ముగిసిన శ్యామల గోపాలన్ ఏఐఎస్ టి ఏ క్రీడ పోటీలు

- **విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే కూనంనేని**







**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి)**

పాల్వంచ–కొత్తగూడెం వేదికగా ఈ నెల 18 నుంచి 22 వరకు నిర్వహించిన శ్యామల గోపాలన్ 2026 జాతీయ స్థాయి సీనియర్ టెన్నిస్ టోర్నమెంట్స్ మంగళవారం ముగిశాయి, ఐదు రోజులపాటు జరిగిన ఈ టోర్నమెంట్ పోటీలో 35+, 45+, 55+, 65+, 70+, 75+ విభాగాల్లో వివిధ ప్రధాన నగరాల నుండి వచ్చిన క్రీడాకారులు పోటీపడ్డారు. ఆతిథ్య జట్టు నుంచి అన్నం, భాస్కర్, కె. సతీష్, చ. కృష్ణారావులు విజేతలు, రన్నర్లుగా నిలిచారు.75+ డబుల్స్‌లో ఏ ఎస్ ఎన్ రాజు–వై. భాస్కర్‌రావు, 70+ సింగిల్స్‌లో ధనుంజయ, డబుల్స్‌లో కే. విజయకృష్ణకుమార్–టి.వి. నాయుడు, 65+ సింగిల్స్‌లో వి. శ్రీనివాస్‌రెడ్డి, డబుల్స్‌లో ఆనంద స్వరూప్–టి. శ్రీనివాస్, 55+ సింగిల్స్‌లో కేవీఎన్ మూర్తి, డబుల్స్‌లో కేవీఎన్ మూర్తి–అన్నం, 45+ సింగిల్స్‌లో జి. రమేష్, డబుల్స్‌లో శివరామ్ రాజు–ఎంవీఎల్ఎన్ రాజు, 35+ సింగిల్స్‌లో మేశ్వరరావు, డబుల్స్‌లో కె. సతీష్–చ. కృష్ణారావు విజేతలుగా నిలిచారు.రన్నర్లుగా 75+ డబుల్స్‌లో వై.వి. రామకృష్ణ–రాజారతన్, 70+ సింగిల్స్‌లో రాధాకృష్ణమూర్తి, డబుల్స్‌లో డి.ఎస్. రావు–పార్థసారథి, 65+ సింగిల్స్‌లో ఎస్.ఎస్. రాథ్, డబుల్స్‌లో వి. శ్రీనివాస్‌రెడ్డి–బి. జోజిరెడ్డి, 55+ సింగిల్స్‌లో ప్రభజన్ రెడ్డి, డబుల్స్‌లో జి. విజయకుమార్–ఆర్. ఎస్. రాథోడ్, 45+ సింగిల్స్‌లో ఎంవీఎల్ఎన్ రాజు, డబుల్స్‌లో భాస్కర్–గంజి వెంకటేశ్వర్లు, 35+ సింగిల్స్‌లో మూర్తి కృష్ణప్ప, డబుల్స్‌లో మేశ్వరరావు–కురిమిన రవి నిలిచారు. ఈ ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్యఅతిథిగా పాల్గొని విజేతలు, రన్నర్లకు బహుమతులు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే క్రీడాకారులను ఉద్దేశించి మాట్లాడుతూ క్రీడ పోటీలు మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని అన్నారు, జాతి సాయి పోటీలు పాల్వంచలో నిర్వహించిన నిర్వాహకులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో పాల్వంచ కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె. సుజాత, డీవైఅండ్ఎస్ఓ పరంధామరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా, ఏ ఐ ఎస్ టి ఏ చీఫ్ రిటైర్డ్ జడ్జి రామకృష్ణ, బి కే డి టి అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్‌రెడ్డి, కార్యదర్శి జకరయ్య, ఎన్ ఎస్ ఆర్ బృందం తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలి

- **ప్రమాదాలు ప్రాంతాలను గుర్తించి తక్షణ చర్యలు చేపట్టాలి**
- **జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి**






**కొత్తగూడెం కలెక్టరేట్ , సెప్టెంబర్ 22, (ప్రజా జ్యోతి )** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖల అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి పద్మావతి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా స్థాయి రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు.జిల్లాలో నమోదవుతున్న రోడ్డు ప్రమాదాలు, మృతి చెందిన వారు, గాయపడిన వారి వివరాలతో పాటు ప్రమాదాల నివారణకు చేపడుతున్న చర్యలపై సమీక్షించారు.జనవరి 1 నుంచి సెప్టెంబర్ 15 వరకు జిల్లాలో మొత్తం 370 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదాల్లో 176 మంది మృతి చెందగా, 23 మంది తీవ్రంగా, 344 మంది స్వల్పంగా గాయపడ్డారు. రోడ్డు ప్రమాదాల తీవ్రతను తగ్గించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో సమర్థవంతంగా పనిచేయాలని డీఆర్వో పద్మావతి సూచించారు.సెప్టెంబర్ 1 నుంచి 15 వరకు జిల్లాలో 21 రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయని అధికారులు వివరించారు. ఈ ప్రమాదాల్లో 12 మంది మృతి చెందగా, ఇద్దరు తీవ్రంగా, 12 మంది స్వల్పంగా గాయపడ్డారు. మరో 17 మంది ఎలాంటి గాయాలు లేకుండా బయటపడ్డారు. ఇటీవలి కాలంలో ప్రమాదాల పరిస్థితిని పరిశీలించి, ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఆర్వో సూచించారు.జిల్లాలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి అక్కడ రోడ్డు భద్రతా చర్యలను తక్షణమే చేపట్టాలని ఆమె ఆదేశించారు. అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్, రిఫ్లెక్టర్లు, వీధి దీపాలు తదితర సౌకర్యాలను ఏర్పాటు చేయాలని సూచించారు. రోడ్లపై ఉన్న ప్రమాదకర మలుపులు, కూడళ్లు, ఇతర సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి సంబంధిత శాఖలు సమన్వయంతో పరిష్కరించాలని తెలిపారు.వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ముఖ్యంగా హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీఆర్వో పద్మావతి సూచించారు. అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, నిర్లక్ష్యపు డ్రైవింగ్, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించకపోవడం వంటి నిబంధనల ఉల్లంఘనలపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్, రవాణా శాఖ అధికారులను ఆదేశించారు.ప్రమాదాలు జరిగిన ప్రాంతాలను పరిశీలించి, ప్రమాదాలకు కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎస్పీ వెంకన్న బాబు, డీఆర్ఎం బాలాజీ, ఆర్అండ్‌బీ ఈఈ, డీఈఈ, ఎన్‌హెచ్ఏఐ అధికారులు, రవాణా శాఖ ఏఎంవీఐ, పోలీస్ సీఐ రాజు, మున్సిపల్ కమిషనర్ సంబంధిత శాఖల అధికారులు,పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి

- **జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మావతి**
- **జిల్లాలో నేటి వరకు 2190.63 కేజీల గంజాయి సీజ్**
- **సీజ్ చేసిన గంజాయి విలువ విలువ రు. 11,20,81,500 లు**

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 22, (ప్రజా జ్యోతి)** కొత్తగూడెం జిల్లాలో మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారిణి (డీ. ఆర్.ఓ) పద్మావతి అధికారులను మంగళవారం ఆదేశించారు. ఐడిఓసీ లోని జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నివారణ కమిటీతో సమావేశం మంగళవారం నిర్వహించి మాట్లాడారు.జిల్లాలో ఇప్పటివరకు 2190.63 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని, దాని విలువ రు. 11,20,81,500 ఉంటుందని, మొత్తం 219 మందిని అరెస్టు చేయాగా ముగ్గురు పరారీలో ఉన్నట్లు డి.ఆర్.ఓ కు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 65 మందిని డీ – అడిక్షన్ సెంటర్ కు తరలించినట్లు వివరాలు వెల్లడించారు. మాదకద్రవ్యాల వినియోగంతో వ్యక్తుల జీవితాలు దుర్భరమవుతాయని, ముఖ్యంగా యువత వీటి బారిన పడకుండా ముందస్తు అవగాహన కల్పించడం అవసరమన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులు, యువత, కార్మికులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు పటిష్ట నిఘా వ్యవస్థ ఏర్పాటు చేయాలని తెలిపారు. కార్మికులు పనిచేసే ప్రాంతాల్లో గంజాయి సరఫరాపై ప్రత్యేక పర్యవేక్షణ ఉండాలని, మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణా వంటి చర్యలను తీవ్రంగా పరిగణించాలని అన్నారు.ఆర్టీసీ ద్వారా జరుగుతున్న అక్రమ రవాణాను అరికట్టేందుకు ఆర్టీసీ కండక్టర్లు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, అనుమానాస్పద వస్తువులపై ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని డీ. ఆర్.ఓ ఆదేశించారు.జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ పరివర్తన అనే పథకంలో పాఠశాల, కళాశాల విద్యార్థులకు ప్రత్యేక అవగాహణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు డి.డబ్ల్యు.ఓ స్వర్ణలత లేనినా డీ.ఆర్.ఓ కు తెలిపారు. అదేవిధంగా వివిధ శాఖల అధికారులు డి.ఆర్.ఓకు తమ కార్యచరణలను వివరించారు.ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబూరావు,ఇల్లందు డిఎస్పీ వెంకన్న బాబు, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి హెచ్. వెంకటేశ్వర్లు, డీఈఓ కార్యాలయ అధికారి రామారావు,జిల్లా రవాణా శాఖ ఏ.ఎం. వి.ఐ శ్వేత,వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# అడవిని దోచుకో అడిగినంత పైసలు ఇచ్చుకో?

- దురదపాడు అటవీ సెక్షన్‌లో గిరిజనుల ఆరోపణలు
- అనుమతి పేరుతో దందా సాగుతోందా?
- విధులకు మూడు రోజులు.. అందులోనూ అందుబాటులో లేని అధికారి!






**అశ్వరావుపేట సెప్టెంబర్ 22 ప్రజా జ్యోతి**

అడవిని కాపాడాల్సిన అధికారి అందుబాటులో లేకపోతే.. అడవిని పర్యవేక్షించేది ఎవరు? అశ్వరావుపేట మండలం దురదపాడు అటవీ సెక్షన్‌లో పనిచేస్తున్న సెక్షన్ అధికారిపై స్థానిక గిరిజనులు తీవ్ర ఆరోపణలు చేస్తున్నారు. అడవిలో చెట్లు, పుట్టలు, ఇసుక, వంట చెరుకు వంటి వాటి విషయంలో తన అనుమతి లేకుండా ఎలాంటి పని జరగనివ్వడం లేదని, ఇందుకు సంబంధించి డబ్బులు ఇవ్వాల్సిందేనన్న రీతిలో వ్యవహరిస్తున్నారని గిరిజనులు ఆరోపిస్తున్నారు. పైసలు ఇవ్వకపోతే అడవి నుంచి ఒక్క చీపురు పుల్ల కూడా బయటకు వెళ్లనివ్వనంటున్నారని వారు వాపోతున్నారు.

**గిరిజనుల నుంచే ఎరువులా?**

అటవీ ప్రాంతాల్లో ప్లాంటేషన్ కోసం వినియోగించే చెట్లకు యూరియా, ఇతర ఎరువులను కూడా గిరిజనులే సమకూర్చాలని ఒత్తిడి చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అలాగే గిరిజన ప్రాంతాల్లో ట్రాక్టర్లు కలిగిన యజమానుల వాహనాలను అధికారి తన అవసరాలకు ఉచితంగా వినియోగించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.అధికారిక విధుల్లో భాగంగానే వాహనాలు వినియోగిస్తున్నారా? లేక వ్యక్తిగత అవసరాలకా? అనే దానిపై ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

**వారానికి మూడు రోజులే విధులా?**

సెక్షన్ అధికారి వారానికి రెండు నుంచి మూడు రోజులు మాత్రమే విధులకు హాజరవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాల్వంచ నుంచి విధులకు వస్తున్న ఆ మూడు రోజుల్లో కూడా రోజువారీ ప్రయాణాలకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.అటవీ ప్రాంతం విస్తారంగా ఉన్న నేపథ్యంలో అధికారి నిరంతరం అందుబాటులో లేకపోతే అటవీ సంరక్షణ, అక్రమ రవాణా నియంత్రణ, గిరిజనుల సమస్యల పరిష్కారం ఎలా జరుగుతుందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**ఫోన్ పనిచేయదా.. అధికారి అందుబాటులో ఉండరా?**

అటవీకి సంబంధించిన సమాచారం ఇవ్వాలన్నా, సమస్యను తెలియజేయాలన్నా అధికారిని ఫోన్‌లో సంప్రదించడం కష్టంగా మారిందని గిరిజనులు చెబుతున్నారు. అధికారి అందుబాటులో లేకపోవడంతో తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదని వాపోతున్నారు.

**స్మగ్లర్లతో సంబంధాలున్నాయా?**

ఇదే ఇప్పుడు అత్యంత కీలకమైన ఆరోపణ. అటవీ స్మగ్లర్లకు అధికారి సహకరిస్తున్నారా? స్మగ్లర్లతో చేతులు కలిపి అక్రమ దందాకు అవకాశం కల్పిస్తున్నారా? అనే అనుమానాలను గిరిజనులు వ్యక్తం చేస్తున్నారు.అయితే ఇవి ప్రస్తుతం గిరిజనులు చేస్తున్న ఆరోపణలు మాత్రమే. వీటిలో వాస్తవం ఎంత ఉందో తేల్చాల్సింది అటవీ శాఖ ఉన్నతాధికారుల విచారణే.

**ఉన్నతాధికారుల విచారణ ఎప్పుడు?**

దురదపాడు సెక్షన్‌లో అధికారి హాజరు రికార్డులు, విధుల నిర్వహణ, ట్రాక్టర్ల వినియోగం, ప్లాంటేషన్‌కు సంబంధించిన ఎరువుల కొనుగోళ్లు, అటవీ ఉత్పత్తుల రవాణాకు సంబంధించిన అనుమతులు, అక్రమ రవాణాపై నమోదైన కేసులు వంటి అంశాలపై ఉన్నతాధికారులు సమగ్రంగా పరిశీలించాలని గిరిజనులు కోరుతున్నారు.అడవిని రక్షించాల్సిన వ్యవస్థలోనే అక్రమాలకు అవకాశం ఉందన్న ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో.. ఉన్నతాధికారులు క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి వాస్తవాలను బయటపెట్టాలి. ఎఫ్ డి ఓ స్థాయి అధికారుల తో విచారణ జరిగితే తప్ప ఇక్కడ వాస్తవ పరిస్థితులు అర్థం కావని తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు".

## మీ సేవ, ఆధార్ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీ



**చర్ల, సెప్టెంబర్ 22:(ప్రజా జ్యోతి):** చర్ల, దుమ్ముగూడెం మండలాల్లోని మీ సేవ, ఆధార్ కేంద్రాలను ఈ–డిస్ట్రిక్ట్ మేనేజర్ సైదేశ్వరరావు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో టీజీటీఎస్ జిల్లా మేనేజర్ కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న సేవలు, సేవల నిర్వహణ, నిర్ణీత పని వేళలు, ప్రజలకు కల్పిస్తున్న సౌకర్యాలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన రుసుములనే ప్రజల నుంచి వసూలు చేయాలని, అదనపు రుసుములు వసూలు చేయరాదని కేంద్రాల నిర్వాహకులకు స్పష్టం చేశారు.మీ సేవ, ఆధార్ సేవల కోసం వచ్చే ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారికి అవసరమైన సేవలను సకాలంలో, సక్రమంగా అందించాలని సూచించారు. నిర్ణీత పని వేళలను తప్పనిసరిగా పాటిస్తూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు.ప్రజలకు పారదర్శకంగా, వేగవంతంగా, నాణ్యమైన సేవలు అందించడమే లక్ష్యంగా కేంద్రాలను నిర్వహించాలని సైదేశ్వరరావు సూచించారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించకుండా, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## చేతబడి పేరుతో వృద్ధురాలిపై దాడి

- తాళ్లతో కొట్టి.. చెట్టుకు కట్టేసి.. మేకులు కొట్టిన ఘటనపై పోలీసుల సుమోటో కేసు



**బూర్గంపహాడ్, సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి):** చేతబడి పేరుతో ఓ వృద్ధురాలిపై అమానుషంగా దాడి చేసిన ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో బూర్గంపహాడ్ పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బూర్గంపహాడ్ మండలం జింకలగూడెం గ్రామంలో ఈ ఏడాది జూలైలో ఈ ఘటన జరిగినట్లు పోలీసులు తెలిపారు.పోలీసుల వివరాల ప్రకారం.. జింకలగూడెం గ్రామానికి చెందిన ఎస్కే షకీనా బీ అనే వృద్ధురాలు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిపారు. కాగా ఆమె ఆరోగ్య పరిస్థితిని మూఢనమ్మకాలతో ముడిపెట్టి, చేతబడి చేసిందనే నెపంతో ఆమె బంధువులు, మరికొందరు కలిసి దారుణంగా ప్రవర్తించినట్లు పేర్కొన్నారు. వృద్ధురాలిని తాళ్లతో కొట్టి, చెట్టుపైకి ఎక్కించి, చెట్టు కింద మేకులు కొట్టిన దృశ్యాలు ఉన్న వీడియో తాజాగా సామాజిక మాధ్యమాల్లో వెలుగులోకి రావడంతో పోలీసులు ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్నారు.ఈ ఘటనకు సంబంధించి షేక్ మదర్, షేక్ ఫయాజ్, కరీముల్లా, మరికొందరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు. వీడియో ఆధారంగా ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరిస్తూ దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

**మూఢనమ్మకాల పేరుతో హింసిస్తే కఠిన చర్యలు**

చేతబడి, మూఢనమ్మకాల పేరుతో ఎవరినైనా వేధించడం, దాడి చేయడం, దుర్భాషలాడడం, అవమానించడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పాల్వంచ డీఎస్పీ ఆర్. సతీష్ కుమార్ హెచ్చరించారు. అనారోగ్య సమస్యలకు వైద్యపరమైన చికిత్స పొందాల్సిన సమయంలో మూఢనమ్మకాలతో బాధితులను హింసించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు.మండలంలో ఇలాంటి ఘటనలు ఎక్కడైనా చోటుచేసుకున్నా, వాటిని ప్రోత్సహించకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని డీఎస్పీ సూచించారు. మూఢనమ్మకాల పేరుతో అమాయకులను హింసించే వారిపై చట్టప్రకారం చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

## పరిశుభ్రతే ఆరోగ్యానికి పునాది

- స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో జెడ్పీ సీఈవో నాగలక్ష్మి

**బూర్గంపాడు, సెప్టెంబర్ 22 (ప్రజా జ్యోతి):** పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా భావించినప్పుడే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని జెడ్పీ సీఈవో నాగలక్ష్మి అన్నారు. ప్రజల్లో పరిశుభ్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు శ్రమదానం ద్వారా ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంచడమే స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.మంగళవారం బూర్గంపహాడ్ మండలం మోరంపల్లిబంజర్ ఎంపీపీఎస్‌లో నిర్వహించిన స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో ఆమె పాల్గొని విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా నిర్దేశిత ప్రదేశాల్లోనే వేయడం, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. 'స్వచ్ఛ మోరంపల్లిబంజర్' కోసం ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నాగలక్ష్మి పిలుపునిచ్చారు. పాఠశాలలతో పాటు గ్రామాల్లోనూ పారిశుధ్యంపై ప్రజల్లో నిరంతరం అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. చిన్న వయస్సు నుంచే విద్యార్థుల్లో పరిశుభ్రతపై బాధ్యతాయుతమైన ఆలోచనలను పెంపొందిస్తే, భవిష్యత్‌లో స్వచ్ఛమైన గ్రామాలు, ఆరోగ్యకరమైన సమాజం నిర్మించవచ్చని పేర్కొన్నారు.అనంతరం విద్యార్థులతో పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేయించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. మొక్కల సంరక్షణతో పాటు పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా గ్రామ పరిసరాలను ఆహ్లాదకరంగా, ఆరోగ్యకరంగా తీర్చిదిద్దవచ్చన్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జమలారెడ్డి, ఎంపీవో రామకృష్ణ, ఏపీవో విజయలక్ష్మి , పాఠశాల హెచ్‌ఎం శిరోమణి, ఉపసర్పంచ్ పొక్కుల రవి, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి భవాని, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## సురక్షిత ఆహారం అందించాలి

- జిల్లా రెవెన్యూ అధికారిణి పద్మావతి

**కొత్తగూడెం కలెక్టరేట్ , సెప్టెంబర్ 22, (ప్రజా జ్యోతి )** సురక్షితమైన ఆహారం, ఆరోగ్యం ప్రధాన ఉద్దేశ్యంగా ఆహార భద్రత శాఖ నిరంతరం పనిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారిణి (డీ. ఆర్.ఓ ) పద్మావతి అన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో ఆహార భద్రత పై మంగళవారం సమీక్ష సమావేశం లో ఆమె మాట్లాడారు,జిల్లాలో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, కల్తీ పై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా ఆహార భద్రతా అధికారి శరత్ కు సూచించారు. జిల్లాలోని ప్రతి ఆహార వ్యాపార నిర్వాహకుడు ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ ఆహార లైసెన్స్ / రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా పొందాలని ,ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ శరత్ ఈ సందర్భంగా డీ.ఆర్. ఓ కు తెలియజేసారు.ఆహార వ్యాపార నిర్వాహకులకు లైసెన్స్, రిజిస్ట్రేషన్ పొందే ప్రక్రియను సులభతరం చేయడానికి గతంలో ఆహార లైసెన్స్ & రిజిస్ట్రేషన్ మేళా నిర్వహించామని గుర్తుచేశారు.హోటళ్లు, రెస్టారెంట్లు, క్యాటరింగ్ సంస్థలు, బేకరీలు, స్వీట్ షాపులు, కిరాణా దుకాణాలు, వీధి ఆహార విక్రయదారులు, ఆహార తయారీదారులు, హోల్ సేల్ , రిటైల్ వ్యాపారులు, ఇతర అన్ని రకాల వ్యాపారస్తు లు ఈ మేళాను సద్వినియోగం చేసుకోగా 60మందికి రిజిస్ట్రేషన్లు చేసుకోవడం వలన ఫుడ్ లైసెన్స్ మంజూరు చేసామని తెలిపారు. ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ / రిజిస్ట్రేషన్ పొందాలని, రెన్యువల్ చేసుకోవాలని వ్యాపారులను డీ. ఆర్.ఓ సూచించారు.ప్రతి ఆహార వ్యాపారానికి లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ ఉండటం చట్టబద్ధమైన బాధ్యత మాత్రమే కాకుండా, వినియోగదారులకు సురక్షితమైన, నాణ్యమైన ఆహారం అందించడంలో ముఖ్యమైన భాగం" అని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు తనిఖీలు చేపట్టి సర్వేలన్స్ శాంపిల్స్, ఎన్ఫోర్స్మెంట్ శాంపిల్స్ సేకరించి 59 నమోదు చేశామని డీ. ఆర్. ఓ లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ వైద్యులు డాక్టర్ ప్రతాప్ డీఈఓ కార్యాలయ అధికారి రాజ్ కుమార్, డిపిఓ కార్యాలయ అధికారి ఉమర్ ఫర్, ఫుడ్ అనాలసిస్ట్ ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

